వద్దిరాజు ఏకగ్రీవంపై హర్షం

అశ్వారావుపేట, ఫిబ్రవరి 20: బీఆర్ఎస్ తరున వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఏకగ్రీవంగా కావడంపై మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

పాల్వంచ రూరల్; ఫిబ్రవరి 20: మండలంలోని ప్రముఖ దేవాలయమైన పెద్దమ్మ తల్లి ధర్మకర్తల మండలి నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో రజనీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మకర్త నియామకం కోసం ఆసక్తి కల అభ్యర్థులు 20 రోజుల్లోపు తమ దరఖాస్తులను వరంగల్, ఖమ్మం కేంద్రాల్లో దేవాదాయ శాఖ కార్యాలయాలకు పంపాలని సూచించారు. కాగా, ప్రస్తుత ధర్మకర్తల మండలి పదవీకాలం ఈ నెల 25తో ముగియనుంది.

కట్టమైసమ్మ జాతరకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 20: మండలంలోని నారాయణపురం సమీపంలో ఉన్న కట్టమైసమ్మ జాతరకు రావాలని కోరుతూ మంగళవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రం ఇచ్చారు. ఈ నెల 28 నుంచి జాతర ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గేనాల శివ, పెదపూడి సత్యవతి, చిన్ని, రమేశ్, నాగార్జున తదితరులు ఉన్నారు.

లేక్‌వ్యూ పార్క్ ప్రారంభం

ఇల్లెందు, ఫిబ్రవరి 20: పట్టణంలోని 24వ వార్డులో గల లేక్‌వ్యూ చిల్డ్రన్ పార్క్‌ను ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. పిల్లలు సరదాగా గడిపేందుకు పార్క్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కమిషనర్ నవీన్, మేనేజర్ అంకుషావలి, కౌన్సిలర్లు ఏఈ శంకర్ పాల్గొన్నారు.

దారులన్నీ మేడారం వైపే..

భక్తులతో కొత్తగూడెం బస్టాండ్ ప్రాంగణం కిటకిట
మొక్కులు తీర్చుకునేందుకు జిల్లా ప్రజల పయనం
తెలంగాణ కుంభమేళాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

కొత్తగూడెం అర్బన్: మేడారం వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న భక్తులు, బస్సు ఎక్కేందుకు సామగ్రితో ఆటోలో వచ్చిన భక్తులు, భక్తులతో నిండిన ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 20: రెండేళ్లకోసారి మేడారంలో జరిగే సమ్మక్క – సారలమ్మ జాతరను చూసేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు జిల్లా ప్రజలు పయనమయ్యారు. దీంతో దారులన్నీ మేడారం వైపే చూపిస్తున్నాయి.

జిల్లా కేంద్ర పరిసర ప్రాంతాల ప్రజలు కొత్తగూడెం మీదుగా వెళ్లాల్సి రావడంతో పట్టణం కిటకిటలాడుతోంది. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే ఈ తెలంగాణ కుంభమేళాకు పలు ప్రత్యేక బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. ఇందుకోసం బస్టాండ్ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. దీంతో ఆ ప్రాంగణం కిక్కిరిపోతోంది. జాతర ప్రారంభంతోపాటు సారలమ్మ గద్దెల మీదకు వచ్చేది బుధవారమే కావడంతో మంగళవారం ఉదయం నుంచే భక్తుల రద్దీ పెరిగింది.

ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆర్టీసీ..

జాతరకు వెళ్లే, వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. 180 స్పెషల్ బస్సులను నడిపిస్తున్నారు. మారుమూల గ్రామాల నుంచి వచ్చిపోయే భక్తులకు కూడా ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. గద్దెల వరకూ ప్రయాణం సాఫీగా సాగేలా, అమ్మవార్ల తనివితీరా దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేలా ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. బస్సుల వివరాలను భక్తులకు ఎప్పటికప్పుడు తెలిపేందుకు ప్రత్యేకంగా వలంటీర్లను బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు నియమించారు.

భక్తులకు అల్పాహారం ఏర్పాట్లు..

జాతరకు వెళ్లే భక్తుల కోసం పట్టణంలోని శ్రీఆంజనేయ జ్యూయలరీస్ నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు. కొత్తగూడేనికి చెందిన కొంతమంది యువకులు భక్తుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి పంపిణీ కేంద్రాన్ని ప్రారంభించారు. అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులను అందజేస్తున్నారు.

24 గంటలూ ప్రత్యేక బస్సులు..

– బాణాల వెంకటేశ్వరరావు, ఆర్టీసీ డీఎం, కొత్తగూడెం

జాతర జరిగే ఈ నాలుగురోజుల పాటు కొత్తగూడెం బస్టాండ్‌లో 24 గంటల పాటు భక్తుల కోసం ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచుతాం. అదే విధంగా మేడారంలో ప్రత్యేకంగా పాయింట్ ఏర్పాటు చేశాం. ఆయా ప్రాంతాలకు వెళ్లే బస్సుల వివరాలకు అక్కడి ఆర్టీసీ వలంటీర్లు భక్తులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఆర్టీసీ సిబ్బందికి పండ్లు, పులిహోర పంపిణీ

పాల్వంచ, ఫిబ్రవరి 20: మేడారం జాతర విధులు నిర్వహిస్తున్న వందమంది ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బందికి పాల్వంచలోని కృష్ణ ఫ్యాన్సీ యజమాని కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం పులిహోర, దద్దోజనం, పండ్లు పంపిణీ చేశారు. ఆర్టీసీ అధికారులు పాల్వంచ నుంచి ప్రత్యేకంగా 45 బస్సులను నడుపుతున్నారు. వీటిని మధిర డిపో శంకర్ పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో నిరంతరం విధుల్లో ఉంటున్న ఆర్టీసీ సిబ్బందికి సదరు ఫ్యాన్సీ నిర్వాహకులు మంగళవారం అల్పాహారం అందించారు. మధిర డీఎం శంకర్, సామాజిక కార్యకర్త యడ్లపల్లి శ్రీనివాసరావు, దాతలు కృష్ణ దంపతులు, ఆర్టీసీ రిటైర్డ్ ఎస్ఎం ఇజ్రాయేల్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సుల కోసం పడిగాపులు

భద్రాచలం, ఫిబ్రవరి 20: మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఆర్టీసీ బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. మంగళవారం భద్రాచలం ఆర్టీసీ డిపో ఎదుట మూడుగంటలు వేచిఉన్నారు. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం రామారావును వివరణ కోరగా ఉదయం నుంచి సాయంత్రం వరకు 35 బస్సులు మేడారం వెళ్లాయని, వెళ్లిన బస్సులు తిరిగి రావడానికి సమయం పడుతుందన్నారు. ప్రయాణికులకు అసౌకర్యం కలుగకుండా చూస్తామని తెలిపారు.

మేడారం జాతరకు తరలిన భక్తజనం

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 20 : వనదేవతల జాతర మేడారానికి పల్లెల నుంచి భక్తులు కుటుంబసమేతంగా వాహనాల్లో తరలివెళ్తున్నారు. మేడారంలో 21, 22 తేదీల్లో వనదేవతలు గద్దెకు చేరుతుండడంతో ఏజెన్సీ పల్లెదారులన్నీ మేడారం జాతరవైపే అన్నట్లుగా కనిపిస్తున్నాయి. మండలంలో ప్రతి పల్లెలో మేడారం జాతర సందడి నెలకొన్నది. ఏ గ్రామం చూసినా మేడారం ముచ్చట్లే. వేకువజామున జాతరకు వెళ్లేందుకు తమ వాహనాలు ట్రాక్టర్లు, ఆటోలు, జీపులు, కారులు తదితర వాటిని ముస్తాబు చేసుకుని మరీ జాతరకు బైలెల్లిపోతున్నారు.

భద్రాచలం: బస్సు డిపో ఎదుట వేచి ఉన్న భక్తులు, దుమ్ముగూడెం: వాహనాల్లో జాతరకు వెళ్తున్న భక్తులు, కొత్తగూడెం అర్బన్: అల్పాహారం పంపిణీ చేస్తున్న డీఎం, పాల్వంచలో..

పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

'బండి'ని పరామర్శిస్తున్న మంత్రి 'తుమ్మల'

అశ్వారావుపేట, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన ప్రధాన అనుచరుడు బండి పుల్లారావు ఇటీవల ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్నాడు. మంగళవారం మంత్రి తుమ్మల ఆయనను పరామర్శించి ప్రజా జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పదవుల కంటే మనం ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. తొలుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మద్ది ఆంజనేయ స్వామి, పశ్చిమ గోదావరి జిల్లా విజయరాయి రాట్నాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట ఆలపాటి రామచంద్రప్రసాద్, దొడ్డా ప్రసాద్, ఎల్లిన రాఘవరావు, నున్నా రత్నాకర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే పాయంను కలిసిన డీఎస్పీ

మణుగూరు టౌన్, ఫిబ్రవరి 20: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మంగళవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మణుగూరు నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సతీశ్‌కుమార్ ఉన్నారు.

నలుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్

కొత్తగూడెం క్రైం, ఫిబ్రవరి 20: నకిలీ ధ్రువపత్రాలతో బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి చొరబడిన నలుగురు వ్యక్తులను త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఒడ్డేపల్లి మురళి మంగళవారం విలేకరులకు వెల్లడించారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సఫాయి బస్తీలో ఓ ఇంటి వద్ద నిర్మాణ పనులు చేపడుతున్న కూలీల్లో నలుగురిపై పోలీసులకు అనుమానం వచ్చింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించి విచారణ చేపట్టారు. బంగ్లాదేశ్‌లోని జహేనైదాహ జిల్లా గుర్జహ్ డాకతీయ గ్రామానికి చెందిన మహ్మద్ ఆజాద్ అలియాస్ షేక్ ఆజాద్(24), మహ్మద్ రాబిన్‌మియా(19), అదే జిల్లాలోని బైర్బ గ్రామానికి చెందిన మహ్మద్ అలామిన్ హుస్సేన్(19), గాడపోట గ్రామానికి చెందిన మహ్మద్ మోహిన్(19)లుగా గుర్తించారు. వీరంతా నకిలీ ధ్రువపత్రాలను సృష్టించుకొని భారత్‌లోకి అక్రమంగా చొరబడి ఎవరికీ అనుమానం రాకుండా జీవిస్తున్నారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి నకిలీ ధ్రువపత్రాలు, బ్యాంక్ పాస్ బుక్‌లు, ఏటీఎం కార్డులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని.. అండర్ సెక్షన్ 420, 468, 471, సెక్షన్ 14ఏ(బీ) ఇఫ్ ఫారినర్స్ యాక్ట్–1946 ప్రకారం కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ధ్రువీకరించారు. వీరిని కోర్టులో హాజరుపరిచి అనంతరం రిమాండ్ కోసం తరలించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా ఇతర దేశస్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు ఇన్‌స్పెక్టర్ మురళి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిపై దాడి కేసులో ఇద్దరికి శిక్ష ఖరారు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 20: వ్యక్తిపై దాడి కేసులో మెజిస్ట్రేట్ కోర్టులో వేసిన శిక్షను తగ్గిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జూలూరుపాడు మండలం పంతులుతండాకు చెందిన గుగులోత్ బుజ్జి 2015 ఆగస్టు 13న కూరగాయలు తెచ్చేందుకు దుకాణానికి వెళ్లింది. ఆమె భర్త కిషన్.. హెర్నియా ఆపరేషన్ చేయించుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. వారి కుమారుడు పవన్‌కల్యాణ్ ఇంట్లోనే ఉన్నాడు. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఆమె బావ గుగులోత్ శంకర్, అతడి కుమారుడు ప్రసాద్‌లు పొలం తగాదా విషయమై బుజ్జి ఇంట్లోకి వచ్చి ఆమె భర్త కిషన్‌పై కర్రలతో దాడి చేస్తున్నారు. అడ్డుకోబోయిన అతడి కుమారుడు పవన్‌కల్యాణ్‌పైనా దాడి చేశారు. అప్పటికే కూరగాయాల దుకాణం తిరిగి వస్తున్న బుజ్జి దీనిని గమనించి పరుగున వచ్చింది. అప్పటికే ఆమె భర్త కిషన్‌కు తీవ్రమైన గాయాలై రక్తస్రావమవుతోంది. వెంటనే స్థానికుల సహాయంతో ఆమె తన భర్తను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించింది. తరువాత ఈ ఘటనపై జూలూరుపాడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు అనంతరం అప్పటి ఎస్సై శ్రీనివాస్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. 8 మంది సాక్షుల విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువైందని భావిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కాట్రగడ్డ దీప నిందితులైన శంకర్, ప్రసాద్‌లకు చెరో ఏడాది జైలు శిక్ష, రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ 2022 సెప్టెంబర్ 12న తీర్పు చెప్పారు. ఆ తీర్పుపై నిందితులు జిల్లా కోర్టులో క్రిమినల్ అప్పీల్ చేసుకున్నారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆ శిక్షను తగ్గిస్తూ చెరొక నెల జైలు శిక్ష, ఇద్దరికీ రూ.500 చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ పోసాని రాధాకృష్ణమూర్తి వాదనలు వినిపించారు.

రెండు సెల్, నగదు చోరీ

టేకులపల్లి, ఫిబ్రవరి 20: గుర్తు తెలియని వ్యక్తి ఓ ఇంట్లోని రెండు సెల్‌ఫోన్లు, రూ.30వేలు చోరీ చేసిన ఘటన మండలంలో చోటు చేసుకున్నది. టేకులపల్లి ఎస్సై సైదా రవూఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సులానగర్ గ్రామానికి చెందిన బాదావత్ బాలాజి సోమవారం రాత్రి ఇంటి ముందు ఉన్న కిరాణ షాపు మూసివేసి ఇంట్లో పడుకున్నాడు. అర్ధరాత్రి ఇంట్లో ఏదో శబ్దం వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తి పారిపోతున్నట్లు గమనించి వెంబడించగా కారు ఎక్కి పారిపోయాడు. ఇంట్లో కెళ్లి చూడగా రెండు సెల్ ఫోన్లు, బీరువాలో ఉన్న రూ.30వేలు చోరీకి గురైనట్లు బాలాజీ గమనించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థిపై పంచాయతీ గుమస్తా దాడి

సారపాక/బూర్గంపహాడ్, ఫిబ్రవరి 20 : క్రికెట్ ఆడుతున్న ఓ విద్యార్థిపై మద్యంమత్తులో ఉన్న పంచాయతీ గుమస్తా దాడిచేసిన ఘటన మండల కేంద్రంలోని బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కళాశాల క్రీడామైదానంలో క్రికెట్ ఆడుతున్న కళాశాల విద్యార్థి వద్ద ఉన్న బ్యాట్‌ను గుమస్తా అనిల్ నేను ఆడతానని లాక్కున్నాడు. విద్యార్థులంతా నిరాకరించడంతో ఈ మైదానం మాది అంటూ వాగ్వాదానికి దిగాడు. దీంతో మా కళాశాల ఆవరణలో ఆడుకుంటే ఏమైంది అన్న అంటూ విద్యార్థులు ప్రశ్నించడంతో వారితో తరిమాడు. ఈ క్రమంలో ఓ విద్యార్థి తన చేతికి దొరడంతో చితకబాదాడు. కళాశాల ప్రిన్సిపాల్ చిన్నాను వివరణ కోరంగా గుమస్తా దాడి చేసిన విషయం వాస్తవమేనని తెలిపారు.

'తూతూమంత్రంగా ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు'

పాల్వంచ, ఫిబ్రవరి 20: ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ దాడులు రెండు రోజులుగా జిల్లాలో తూతూమంత్రంగానే జరుగుతున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి యెర్రా కామేశ్ ఆరోపించారు. పాల్వంచలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం సిండికేట్ దందాపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని, దీంతో ఎక్సైజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని అన్నారు. దాడులకు వచ్చిన అధికారులకు కేవలం ఒక షాపునకు మాత్రమే జరిమానా విధించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. నాయకులు జెట్టి ఆనందరావు, రంజిత్, ప్రవీణ్, సందీప్, హరికృష్ణ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

కొత్తగూడెం టౌన్, ఫిబ్రవరి 20: సీఎం రిలీఫ్ ఫండ్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీఎంఆర్ఎఫ్ దరఖాస్తుల సమర్పణలో జరిగిన జాప్యంపై సీఎం సానుకూలంగా స్పందించి ప్రతి దరఖాస్తుదారుడికీ సాయం మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గ కేంద్రంలో దరఖాస్తుదారుల నుంచి మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. రోగులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత ఆరు నెలల్లోపు రిలీఫ్ పండ్ కోసం దరఖాస్తు చేసుకోవాలనే నిబంధన ఉందని అన్నారు. అయితే చాలా మంది రోగులు సకాలంలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ ఎన్నికల కోడ్ దృష్ట్యా స్వీకరణ నిలిచిపోవడంతో ఆరు నెలల గడువు ముగిసిపోయిందని అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని సుమారు 500 మందికి పైగా దరఖాస్తుదారులు ఆరు నెలల నిబంధన మూలంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించి ఆరు నెలల నిబంధన తొలగించి ప్రతి దరఖాస్తునూ పరిగణనలోకి తీసుకొని రిలీఫ్‌ఫండ్ మంజూరు చేయాలని కోరారు.

మార్చి 31లోపు పన్నులన్నీ చెల్లించాలి: కమిషనర్

కొత్తగూడెం అర్బన్, ఫిబ్రవరి 20: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు, వ్యాపారులు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి, నీటి తదితర పన్నులతోపాటు ట్రేడ్ లైసెన్సు ఫీజులను కూడా మార్చి 31లోపు చెల్లించాలని కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. గడువులోపు పన్నులు చెల్లించకపోతే సంబంధిత వ్యక్తుల ఆస్తులు జప్తు చేయడంతోపాటు నీటి పంపు కనెక్షన్ తొలగించనున్నట్లు చెప్పారు.

వైభవంగా దీపోత్సవం

సారపాక, ఫిబ్రవరి 20 : మండల పరిధి మోతే పట్టీనగర్‌లోని శివాలయంలో సోమవారం రాత్రి దీపోత్సవం జరిగింది. భక్తులు పూజలు చేసి 1008 దీపాలు వెలిగించారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం ఉండొద్దు

గ్రిడ్‌కు అనుసంధాన పనుల పరిశీలనలో సింగరేణి డైరెక్టర్

రామవరం, ఫిబ్రవరి 20: సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని, విద్యుత్ ఉత్పత్తి సజావుగా సాగేలా సమన్వయంతో పనిచేయాలని డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు సూచించారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న 10.5 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని సోమవారం గ్రిడ్‌కు అనుసంధానం చేసిన సందర్భంగా ఆయా పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సోలార్ ప్లాంట్ ద్వారా రోజుకు 50 వేల యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని అన్నారు. ఈ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని, ఎలాంటి ఆటంకాలు లేకుండా ఉత్పత్తి చేసి రికార్డులు నెలకొల్పాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోలార్ జీఎం జానకీరాం, ఏజీఎం ఈఅండ్ఎం కేవీ రావు, ఏరియా ఇంజనీర్ దుర్గాప్రసాద్, సివిల్ ఏజీఎం రామకృష్ణ, ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈ శ్రీకాంత్, డీవైఎస్ఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు రూరల్: కార్పొరేట్ జీఎంను సన్మానిస్తున్న జీఎం జాన్ ఆనంద్

సమష్టి కృషితోనే లక్ష్యసాధన: జీఎం ఆనంద్

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 20: అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితోనే వార్షిక లక్ష్యాన్ని సాధించామని ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. మంగళవారం జేకే 5 గనిలో ఆయన ఉద్యోగులను అభినందించి మాట్లాడారు. జేకే 5గనికి నిర్ధేశించిన వార్షిక లక్ష్యాన్ని 44 రోజుల ముందే సాధించడం ఆనందంగా ఉందన్నారు. గత సంవత్సరం వార్షిక లక్ష్యాన్ని జేకే పై గని 63 రోజుల ముందుగానే సాధించిందని గుర్తు చేశారు. ప్రాజెక్ట్ అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రాసాద్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావ్, గని మేనేజర్ పులి పూర్ణచందర్, ప్రాజెక్ట్ ఇంజినీర్ చిన్నయ్య, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, పిట్ సెక్రటరీలు సంజీవ్ చారి, సేవియా, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్క్రాప్ వివరాలు నమోదు..

ఇల్లెందు రూరల్, ఫిబ్రవరి 20: ఇల్లెందు ఏరియాలో వివిధ గనుల్లో వినియోగంలో లేని స్క్రాప్ వివరాలను కార్పొరెట్ జనరల్ మేనేజర్స్ బీజీఎస్ఎస్ఎన్ మాచరయ్య బీఆర్ దీక్షితులు, డీజీఎం వేణుమాధవు నమోదు చేసుకున్నారు. మంగళవారం ఏరియాలోని ఏరియా స్టోర్, జేకే 5 ఉపరితల గని, కోయగూడెం ఉపరితల గనులను సందర్శించారు. వినియోగంలో లేని స్క్రాప్‌ను ఏవిధంగా భద్రపరిచారు. ఎంత ఉన్నదనే వివరాలను ఇల్లెందు ఏరి యా జీఎం జాన్ ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. తొలుత జీఎం ఆనంద్ కార్పొరెట్ జీఎంలకు సత్కరించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ నర్సింహరాజు, ప్రాజెక్ట్ అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, ప్రహ్లాద్, సెక్యూరిటీ అధికారి అంజీరెడ్డి, స్టోర్ ఇంజినీర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు మాజీ సైనికుల వినతి

భద్రాచలం, ఫిబ్రవరి 20 : మాజీ సైనికుల కోసం ఆరాం ఘర్, ఫ్లడ్ రిలీఫ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మాజీ సైనిక సంక్షేమ సంఘం బోర్డు సభ్యుడు తిప్పన సిద్ధులు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ ప్రియాంక ఆలకు వినతిపత్రం అందజేశారు. మాజీ సైనికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనిక సంఘం అధ్యక్షుడు సుబేదార్ బండారు వెంకన్న, హవల్దార్ ఆర్కే బెన్హర్, నాయక్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

రామాలయంలో భీష్మ ఏకాదశి పూజలు

భద్రాచలం, ఫిబ్రవరి 20 : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామార్చన 11సార్లు జరిపారు.

కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

టేకులపల్లి, ఫిబ్రవరి 20: టేకులపల్లిలోని కస్తూర్బా బాలికల ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ఎమ్మెల్యేకు విద్యార్థినులు సూచించారు. మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్, పాఠశాల ఆవరణను పరిశీలించారు. నిరంతరం విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఏఈ హెచ్ దేవను ఆదేశించారు.

ఉద్యమకారులను ఆదుకోవాలని వినతి

చండ్రుగొండ, ఫిబ్రవరి 20: మలిదశ తెలంగాణ ఉద్యమకారులను కోరుతూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు మలిదశ తెలంగాణ ఉద్యకారులు వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రస్థాయి ఎల్టా డ్రామా పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) ఆధ్వర్యంలో ఈ నెల 19న ఎన్ఎస్‌పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఉమ్మడి జిల్లా ఆంగ్ల డ్రామా పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా అన్నపురెడ్డిపల్లి కేజీబీవీ జట్టు ఎంపికైంది. ఈ జట్టు ఈ నెల 26న ఉమ్మడి ఖమ్మం జిల్లా తరపున రాష్ట్రస్థాయిలో పాల్గొననుంది. వారికి డైట్ కళాశాల అధ్యాపకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. డ్రామా పోటీల్లో పాల్గొన్న నాగచైతన్య, గీతిక, సంధ్య, ఊహశ్రీ, జెస్సికాలను అభినందించారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

అశ్వారావుపేట, ఫిబ్రవరి 20: మండలంలో ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి జడ్పీ చైర్మన్, కలెక్టర్‌ను కోరారు. కొత్తగూడెంలో మంగళవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమ